

# ప్రేముడి

## - మంథా భానుమతి



(గత సంచిక తరువాయి)

**“ఆ ఇటిక బొంతిట్టా అందియ్యే** యెంకీ! ఇంక సరిగ్గా పదంటే పది రోజుల్లో మనిల్లు తయారవుద్ది.” ఇటుక వరుస పేరుస్తూ పిలిచాడు నారాయడు. ఉన్న ఇంటిని ఆనుకునే వేస్తుండటంతో సులువైపోయింది. పునాదులు వెయ్యటం, గోడలు సగం లేవటం పదిహేను రోజుల్లో అయింది. రోజూ అదే పని, అదే ధ్యాస. ఇంట్లో ఉన్న నలుగురూ నడుం కద్దే ఎంత సేపు!

నారాయడినే చుస్తూ నిలబడ వెంకటలక్ష్మి ఉలిక్కి పడింది. ఆఛ్ఛాదన లేని భుజాలమీదా, చాతీ మీదా ఎండలో మెరుస్తున్న చెమటని ఎగిరి తన కొంగుతో తుడవాలన్న కోరికని బలవంతం మీద ఆపుకుంది.

“నిన్నేనే! ఏందట్టా గుడ్లప్పగించి చూస్తాండా? పని సంగతి చూడు. ఎంతసేపు నిలబెడ్తావిట్టా?” చూసి చూసి గదమాయించబోయిన నారాయడు వెంకిని చూడగానే, ఎత్తుగా కట్టిన బొంగుల దడి మీద నుంచి, ఇసుక కుప్ప మీదికి ఒక్క దూకు దూకాడు.

“అరే.. జాగ్రత్త మావా! ఏందా దూకుడు? ముందూ ఎనకా చూసుకో..” వెంకి ఆదుర్దాగా అంది.

ఎర్రటి చుక్కల చీర, మోకాళ్ళ పైకి గోచీ బిగించి కట్టింది. ఒంటి కంటుకు పోయిన నల్ల జాకెట్టు వెంకి అందాన్ని రెట్టింపు చేస్తోంది. సరిగ్గా అప్పుడే గంపలో నాలుగిటికలు పెట్టి, నెత్తి మీద సర్దుకుంటోంది. రెండు చేతులూ పైకి చేర్చి, గంపని సర్దుతున్న దల్లా కెవ్వుమంది.

వెనుక నుంచి వాటేసుకున్నాడు నారాయడు.

“ఏందయ్యా! పట్టపగలు.. ఆరు బైట. ఎవురన్నా చూత్తే.. అత్త, మామ ఇంట్లనే ఉన్నారు.” చేతులు గంపని పట్టుకుని, నెత్తి మీద బందీలైపోయాయి. విడిపించుకునే అవకాశమే లేదు. బుంగ మూతి పెట్టి ముద్దుగా విసుక్కుంది.

“అమ్మా, నాయనా బువ్వతిని తొంగున్నారు లెయ్యే. మనం ఇప్పుడే ఈ గదిలో ఆరంభం చేసేద్దామా? నిన్ను చూత్తా వుంటే ఆగ లేక పోతున్నా. గోడలు లేచినయ్యి కదా!” బతిమాలాడు నారాయడు.

“అదేం కుదరదు. కప్పు వెయ్యకుండా.. పూజ చెయ్యకుండా లోనికి యెల్లనే కూడదు. నువ్విట్టా ఆలీశం చేసిన కొందీ ఇంకా వెనుకడిపోద్ది. నేనెల్లి కూకుంటా.” మొగుడి బంధంలోంచి నెమ్మదిగా కిందికి జారి నేల మీద గొంతుక్కూర్చుని, గంపా ఇటికలూ కింద పెట్టేసింది వెంకటలక్ష్మి.

అస్తవ్యస్తంగా కూర్చోడంలో నడుం కలుక్కుమంది.

“అబ్బా!” నడుం పట్టుకుని పెద్దగా మూలిగింది.

“అయ్యో.. ఏటయిందే! పట్టేసిందా? గమ్మునుండకుండా మెలికలు తిరిగితే ఏమవుద్ది?” గాభరాగా వంగుని చూడబోయాడు.

మాట్లాడకుండా అలాగే ఒక పక్కగా నేల మీదికి ఒరిగి పోయింది.

“అమ్మా! అమ్మా!” గట్టిగా అరిచాడు నారాయడు.

"ఏందిరా.. ఏమైంది? వస్తన్నా.." ఇంట్లోంచి పరుగెత్తినట్టుగా వచ్చారు తల్లీ, తండ్రీ.

"నడుం పట్టేసిందే.. గిలగిల్లాడి పోతాంది. ఏం చెయ్యాల?" ఏడుపు గొంతుతో అన్నాడు నారాయడు.

"ఎత్తుకోని ఇంట్లోకి తీసుకెల్లి పండబెట్టు. నే కొట్టుకెళ్ళి తైలం పట్టుకొస్తా." మల్లయ్య పెద్ద పెద్ద అంగలేస్తూ తడిక గేటు తీసుకుని బైటికెళ్ళిపోయాడు.

"ఏందోరా.. అంతా ఆగమాగం ఐతాంది. పిల్లది చూడు ఎట్టా వాడిపోతాందో. నెమ్మదిగా అట్టగే నొప్పి కలక్కుండా తీసుకెల్లు. ఆ గంప ఎత్తేప్పుడు ఏ నరం పట్టేసిందో. ఆచారి గారి దగ్గరేదైనా మందుండేమో చూసొత్తా.. ఏదో పసరిత్తారు. జాగర్త." జాలమ్మకూడా హడావిడిగా బైటి కెళ్ళిపోయింది.

నారాయడు అపురూపంగా, మోకాళ్ల కిందొక చెయ్యి,వీపుకిందో చెయ్యి వేసి నెమ్మదిగా లేపి ఇంట్లోకి తీసుకెళ్ళి, నులక మంచం మీద పడుకోబెట్టాడు.

"అమ్మో!" మూలిగింది వెంకటలక్ష్మి.

## 4

వెంకటలక్ష్మి కళ్ళు చెమర్చాయి.. కట్టుకున్నోడి ప్రేమకి, అత్తమామల ఆప్యాయతకి. చెంపల మీద నాలుగయిదు చుక్కల కన్నీళ్ళు నిలిచాయి. పక్కటెముకల కింద లాగుతున్న నడుం నొప్పి తగ్గినట్లనిపించింది.

"ఏందే.. నొప్పిగా ఉందా? ఊరుకున్నోడినూరుకోకుండా యెదవపన్లు చెయ్య బొయ్యా చూడు.. నన్ను నేను చెంపలు వాయించుకోవాలి. అనవుసరంగా నీ జోలికొచ్చా. పన్చుసుకోవచ్చు కదా!" నేల మీద కూర్చుని, పక్కనే ఉన్న తుండుగుడ్డతో వెంకి మొహం తుడిచాడు.

"ఫర్లేదు. నెమ్మదిగా సర్దుకుంటాంది. కాస్త కాళ్ళు కప్పుతా.. చలేస్తాంది." ఇట్టాంటిదేదైనా వస్తే బానే ఉంటుంది.. నొప్పిగా ఉన్నా, ఆదుకునే వాళ్ళుంటే. అందుకే జరుగుబాటుంటే జ్వరవంత సుఖం లేదన్నారు.

నారాయడు నడుంకింద చెయ్యి పెట్టి, గోచీ విప్పదీసి, చీర కాళ్ళ కిందికి వచ్చేట్లు సర్దాడు. నరాలు జివ్వున లాగినట్లనిపించింది వెంకటలక్ష్మికి. అంత బాధలోనూ చిరునవ్వు మెరిసింది పెదాల మీద.

అదేం పట్టించుకోకుండా, కుండలో నీళ్ళు తీసి, డబ్బాలో పంచదార మూడు చెంచాలందులో వేసి బాగా కలిపి వెంకి చేత తాగించాడు.. నెమ్మదిగా లేపి కూర్చోపెట్టి.

అమృతం గొంతులోంచి దిగినట్లే ఉంది. వెంకి మొహం కాస్త తేట తీసింది.

"ఏదన్నా తింటాని కుందేమో చూత్తానుండు. నీరసంగా ఉన్నావు." మంచం గోడ కానేట్టు జరిపి, సరిగ్గా పడుకోబెట్టి, దిండు సర్ది లేచాడు.

"ఇప్పుడేం వద్దు. అత్త వచ్చి ఏదన్నా పెడ్తాది. ఇప్పుడు కాస్త తగ్గింది.."

పక్కనే, నేల మీద కూర్చున్న నారాయడి చెయ్యి పట్టుకుని కళ్ళు మూసుకుంది వెంకటలక్ష్మి.

వెన్నెముక లోంచీ నరం పైకి లాగినట్టనిపించిందేమో.. వెంకటలక్ష్మికి నొప్పి తగ్గటానికి నెల పైనే పట్టింది.

ఆ లోగా ఒక కూలీని పెట్టి వాసాలు బిగించి, రేకులు దించేశారు. ఇంక పూజ చేసి, ఇంట్లోకి ప్రవేశించటమే మిగిలింది.

అచారిగారి మందు సంగతేమో కానీ, జాలమ్మ క్రమం తప్పకుండా చేసిన తైల మర్దనం బాగా పన్చేసింది. కదలకుండా కూర్చుని, వేళ తప్పకుండా తింటూ ఉండడంతో వెంకటలక్ష్మి కొద్దిగా ఒళ్ళు చేసింది.

తల్లీ, తండ్రీ వచ్చి కూతుర్ని తీసుకెళ్తామన్నారు.

"అదేంటి వదినా! అమ్మాయి బాగున్నప్పుడు పని చేయించుకుని, కాస్త నలత పడగానే, బాగు చేసి పంపమని మీ దగ్గరకంపేత్తే అదేవంత మెచ్చుకోలు పని? ఇక్కడున్నది మనుషులే కాని మరలు కాదు కదా! కోడల్ని కళ్ళలో పెట్టుకుని చూసుకుంటాం. లేచి తిరగ్గానే తీసుకెళ్ళి నాలుగురోజులు అట్టే పెట్టుకోండి.. మీ ముచ్చటెందుకు వద్దనాలి?" జాలమ్మ డెక్కుపోయిన గొంతుతో అంది.

వెంకటలక్ష్మి కూడా అదే అనడంతో వెనక్కి తిరక్క తప్పలేదు వియ్యాల వారికి.

అయినా కూతురి మొహంలో కనిపిస్తున్న తృప్తి, మాటల్లో వినొస్తున్న సంతోషం.. ఇంక బలవంతపెట్టడానికి కారణం కనిపించ లేదు.

తూర్పు వైపుకున్న పాత ఇంటికి ఆనుకుని కొత్త గది ఉంది. ఐతే వాకిట్లోకి వచ్చి తిరిగి అందులోకి వెళ్ళాలి. గుమ్మం పెట్టడానికి వీలు పడలేదు. ఆ పక్కనే వంటింటి జాగా ఉంది. అదీ మంచిదేలే అనుకున్నాడు నారాయదు.. కొత్త ఊహల్లో తేలిపోతూ.

"అమ్మా! ఈ శనారం బాగుందంట. పడమటింట్లో పెవేశానికి. పంతులుగారు కావలసిన సామాన్ల లిస్టిచ్చారు. పాలు పొంగించి వ్రతం చేసుకో మన్నారు." పొద్దున్నే బైటికెళ్ళిన నారాయదు ఉత్సాహంగా అంటూ ఇంట్లోకొచ్చాదు.. ఇల్లంతా వెంకటలక్ష్మి కోసం వెతుకుతూ.

"అట్టాగే. ఇయ్యాల వారికి కబురందియ్యాల. అయ్య నెల్లి రమ్మని, నువ్వు ఇంటిక్కావల్సిన సరుకుల సంగతి చూడు." టీ పెడుతూ అంది జాలమ్మ.

నారాయదు, అప్పదే దొడ్లో బట్టలెండేసి లోపలికొచ్చిన వెంకి మొహాలు చూసుకున్నారు.

"అది కాదే.. నేనూ, వెంకీ వెల్లొత్తాం. ఆళ్ళెప్పట్నుంచో రమ్మంటన్నారు. వెంకికి నదుం నొప్పి తగ్గి తిరుగుతున్నట్టు ఆళ్ళకి తెలిసినట్టుంటాది. సొయంగా వెళ్ళి పిలిచినట్టుంటాది." నట్టుతూ అన్నాదు నారాయదు.

"అట్టాగే పోయి రండ్రా! సరుకలయ్యా నే తెత్తాలే. టీ సంగతయ్యాక, కాస్త ఉప్పు పిండి కలె బెట్టే.. పిల్లలు తిని ఎల్తారు. ఆ ఊరెళ్ళే సరికి ఎండ నడినెత్తికొచ్చేత్తాది. రేపు మద్దిన్నానికి వొచ్చెయ్యండి. ఇక్కడి పన్లు జూసుకోవాల." మల్లయ్య వాకిలి బైట చుట్ట పీలుస్తూ అన్నాదు.

"ఈ పూజకీ, భోయనాలకీ రెండు వేలవ్వుద్ది. డబ్బు ఏవైనా సర్దుతారేమో కూడా అడుగుతా."

"వద్దొద్దు. ఈ మూణ్ణెల్లలో, చేపలు పట్టి బేరవెట్టింది మూడు వేల దాక ఉంది. అది ఖర్చు పెడదాం. వాళ్ళ నెందుకు ఇబ్బంది పెట్టడం. నువ్వెళ్ళి మర్యాదగా అందరినీ రమ్మని చెప్పి రా." చుట్ట పీక అవతలికి విసిరేసి, లోపలి కొచ్చి అన్నాదు మల్లయ్య.

దొడ్లో పూసిన చేమంతులు మాల కడ్తూన్న వెంకటలక్ష్మి మొహంలో నవ్వుల పువ్వులు విరిశాయి..

"ఆగెహె.. కలిసి నడుద్దాం. ఎంత అమ్మా నాయనల దగ్గరకెళ్తుంటే మాత్రం అంత లావు సంబరవా?" రెండు చేతుల్తో నిండుగా ఉన్న సంచీలు మోస్తూ అరిచాదు నారాయదు. దొడ్లో కాసిన సొరకాయలు, గుమ్మడికాయ, పొట్లకాయలు సంచీల్లో పోసి ఇచ్చింది జాలమ్మ. టౌన్లో ఉండే బంధువులు.. అన్ని కూరగాయలు కొనుక్కుని తినాల్సిందే.

చకచకా నడిచేస్తోంది వెంకటలక్ష్మి.. నదుం నిటారుగా పెట్టి. కొద్దిగా తలతిప్పి, ఓరగా చూసి కళ్ళు చికిలిస్తూ ఒక నవ్వు విసిరేసింది నారాయడి మీదికి.

"ఓయబ్బో! ఏం వయ్యారమే! మరీ విరగబడకు.. నదుం సంగతి కాస్త చూసుకో.."

"ఏవన్నా ఐతే నాకేం భయ్యం.. నా మొగుడున్నాడుగా చూసుకోటానికి.." కొంగు తీసి చుట్టూ తిప్పి కుచ్చిళ్ళలోకి దోపి, రెండు చేతులూ నడుం మీద పెట్టి నిలుచుని సవాలు చేసింది.

చుట్టూ చూశాడు నారాయుడు. పొద్దున్న పది గంటలు దాటింది. ఆ రోజు ఆదివారం. ఎవరికీ పట్నంలో అంత పని పడినట్టు లేదు.. కను చూపు మేరలో ఎవరూ కనిపించలేదు.

కొద్దిగా ఒళ్ళు చేసిన వెంకి కొత్త అందాలతో మెరిసిపోతోంది. చామన ఛాయకి ఎక్కువయిన మేని ఛాయ ఆ నీరెండలో వింత కాంతిని సంతరించుకుంది. కవ్విస్తున్నట్లున్న కంటి చూపు నారాయడికి మతి పోగొడుతోంది.

లేత గులాబీ ఫుల్ వాయిల్ చీర నాజూగ్గా గూడ కట్టు కట్టింది. నల్లని ఒన్ బై టూ జాకెట్టు ఒంటికి అతుక్కు పోయి.. చీర అందాన్ని.. ఆ చీర కట్టిన వెంకటలక్ష్మి సోయగాన్ని రెట్టింపు చేస్తోంది. సన్నని నల్లపూసల గొలుసు శంఖం వంటి మెడకి అందంగా అమరింది. బారెడు జడని బిగించి వేసి.. నక్షత్ర చామంతి పూల దండని అర్ధ చంద్రాకారంగా జడ పైన అలంకరించింది. అసలే పెద్ద కళ్ళేమో, సన్నగా తీర్చి దిద్దిన కాటుక రేఖలు బాపు బొమ్మని తలపిస్తున్నాయి.

"నా వల్ల కాదే యెంకీ! నిన్ను చూస్తూ ఒల్లకుండడం. ఏం చెయ్యాలి? మతి పోతోంది. వేరే దేశాల్లో ఏ గోలా లేకుండా ఎక్కడ పడితే అక్కడ ముద్దెట్టుకోవచ్చంట. యెదవ జలమ.. అక్కడైనా పుట్టాం కాదు.." వెంకి దగ్గరగా వచ్చి సంచీలు కింద పెట్టి, బ్రతిమిలాడుతున్నట్లు చూశాడు.

వాడి ఆత్రం చూసి వెంకటలక్ష్మి నవ్వాగలేదు. ఫకాలున నవ్వింది.. ముత్యాల్లాంటి పలువరుస బైట పెట్టి.

ఏ డెంటిస్ట్ దగ్గరికీ వెళ్ళకుండా.. బ్రేసెస్ పెట్టించుకోకుండా, సహజంగానే ఆ పల్లెల్లో ఎక్కువ మంది పలు వరుస తీర్చి దిద్దినట్టుంటుంది. వాళ్ళ టూత్ బ్రష్ లు వేం పుల్లలు. పావుగంట పైగా నమిలి, కుంచెలాగా చేసి, పళ్ళని శుభ్రంగా తోముతారు. అంత సమయం లేకపోతే.. బొగ్గు పొడి జల్లించి మెత్తగా చేసి, అందులో ఉప్పు కలిపి వాడతారు. "మీ టూత్ పేస్ట్ లో సాల్ట్ ఉందా.." అని కాజోల్ యాడ్ లో వచ్చినట్లు.. పళ్ళు బలంగా ఆరోగ్యంగా ఉంటాయి. ఇంకొక ముఖ్యమైన కారణం జల పుష్పాలని ప్రతీ రోజూ ఆహారంలో తీసుకోవడం.

కొంచెం దూరంలో ఉన్న మడ అడవుల (మాన్ గ్రూవ్స్) గుబుర్ల కేసి చూసింది వెంకటలక్ష్మి.

పాలెంలో ఎక్కువ భాగం నేలలో వరి సాగుబడి జరుగుతుంది. కానీ ఒడ్డు దగ్గర పడే కొద్దీ ఉప్పు నీటి పత్రలు నేలలో లవణ శాతాన్ని పెంచి వరి సాగుకి పనికి రాకుండా చేస్తాయి. ఆ ప్రాంతంలో మడ అడవులు విస్తరించుకుంటాయి.

దట్టంగా పరుచుకున్న ఆ తోపులు.. ఎత్తు తక్కువగా ఉన్నా, ఆ గుబుర్లలో చాటు బాగానే ఉంటుంది.

"ఏం బుర్రే నీది వెంకీ! నడు మరీ.." హుషారుగా తోపు కేసి అడుగెయ్య బోయాడు నారాయుడు.

"ఎక్కువ సేపుండద్దు మావా! ఎవురైనా చూస్తే బాగోదు. అత్తకీ, మామకీ చెడ్డ పేరొస్తాది." వెంకికి కూడా పరిష్వంగ సుఖం కావాలనే ఉంది.. కానీ కొంత బిడియం.. కొంత ఎవరైనా చూస్తారేమో ననే భయం.

"అట్టాగే.. పడవకి ఎట్టాగా కొద్ది సేపే టయం ఉంది.." ఉత్సాహంతో సంచీలు తేలికయినట్లనిపించాయి. వెంకి చెయ్యి పట్టుకుని పొదల మాటుకి లాక్కెళ్ళాడు.

ఆకాశంలో అప్పుడే కొన్ని మబ్బులు విహారానికి వచ్చాయి, సూర్యుడ్ని కమ్మేస్తూ.

దరిదాపుల్లో అంతా నిర్మానుష్యం. నారాయడి ఆరాటం ఆకాశాన్నంటుతోంది.

వెంకటలక్ష్మి సిగ్గుల మొగ్గైపోతోంది. పొదల మాటుకి వెళ్ళగానే ఇద్దరూ ఒకర్నొకరు హత్తుకు పోయారు. వెంకి పెదవులు

వణుకుతుండగా, నారాయడి వక్షం మీద తల వాల్చింది. మల్లె పువ్వులాంటి లాల్చీని చుట్టి, రెండు చేతులూ నడుం చుట్టూ తిప్పి, పరవశంగా కళ్ళు మూసుకుంది.

నారాయడు, వెంకి తలా జుట్టు నిమురుతూ, నెమ్మదిగా వెంకి మొహం ఎత్తి, పెదవులు దగ్గరగా చేర్చి చుంబించబోయాడు.

ఉన్నట్లుండి, వెంకి నారాయడ్ని తోసేసింది.

వెనక్కి తిరిగి నేల మీద కూలబడి, రెండు చేతులతో మొహంకప్పుకుంది. వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది. పక్కటెముకలు ఎగిరెగిరి పడుతున్నాయి.

నారాయడు హతాశుడై నిలబడి పోయాడు. ఏం చెయ్యాలో అర్ధం అవలేదు. తనేం తప్పు చెయ్యబోయాడు? సొంత పెళ్ళామే కద! పైగా తనే సూచించింది కూడా.. ఎవరైనా చూశారంటే ఆమె నేదో చేసేశాడనుకుంటారు కూడా!

వెంకి ఏడుపు ఎక్కువయింది. చేతులు వణికిపోతున్నాయి.

"ఏందే యెంకీ! ఎందుకట్టా ఏడస్తాన్నా? మళ్ళా నొప్పి వస్తాందా? యెనక్కెల్లిపోదావా? ఎందుకైనా మంచిదని తైలం తెచ్చా.. రాసేదా? పోనీ పూజ వచ్చేనెల పెట్టుకుందావా?"

తల అడ్డంగా తిప్పింది వెంకటలక్ష్మి. నారాయడు పెళ్లాం పక్కనే గొంతు క్కూర్చున్నాడు.. ఇదెక్కడి గోలరా దేవుడా అనుకుంటూ.

"అట్టా నోరెత్తకండా గోలెడతాంటే నేనేం సెయ్యాల.. ఏదో చెప్పేదు."

"పద, నడుస్తా చెప్తా.." మరచెంబులో నీళ్ళు గ్లాసులో పోసుకుని, కొన్ని నీళ్ళతో మొహం కడుక్కుని, మిగిలినవి తాగి లేచింది వెంకటలక్ష్మి. మొహం తేటగా ఉంది. కళ్ళు స్వచ్ఛంగా నిర్మలంగా మెరుస్తున్నాయి.

నారాయడ్ని అంతవరకూ ఉత్తేజపరచిన వెంకి అప్పుడు మామూలుగా కనిపించింది, అతడి ఉత్సాహం అంతా చల్లారి పోగా!

ఇద్దరూ పక్క పక్కనే నడుస్తున్నారు. ఒక బరువైన సంచీ రెండు కొసలూ చెరొకరూ పట్టుకున్నారు. ఒకరి చెయ్యి ఒకరికి తగిలినా ఏమీ అనిపించడం లేదు.

వెంకటలక్ష్మి కాలి కింద ఏదో తట్టుకుని ముందుకి తూలింది. నారాయడు సంచీ కింద పెట్టి పట్టుకోబొయ్యాడు. వెంకి కూడా సంచీ కొస వదిలేసి.. కాలికి తగిలిందేవిటా అని చూసింది..

యెండ్రకాయ.. ఇసుకలో కదులుతోంది. వరుసగా ఇసుక పైకీ కిందికీ కదులుతోంది.

వెంకీ, నారాయడు గబగబా కింద మోకాళ్ళ మీద కూర్చుని, ఇసకని జరపడం మొదలెట్టారు. వరుసగా.. ఎన్నెన్నో వరుసల్లో ఎండ్రకాయలు.. నెమ్మదిగా కదులుతున్నాయి. ఎక్కడికో వలస వెళ్ళి పోతున్నట్లు.

వెంకి కళ్ళు పెద్దవి చేసి వాటిని చూస్తోంది. నారాయడు సంభ్రమంగా అందులో ఒక ఎండ్రకాయని పట్టుకోబోయాడు.

"అయ్యో! ఒక ఖాళీ డబ్బా కానీ, సంచీ కానీ తేవాల్సిందే యెంకీ! ఇయాల విందు చేసుకునేటోల్లం." నారాయడు నిండుగా ఉన్న తన సంచీల కేసి చూశాడు.

"వద్దు మావా! వాటిని వదిలెయ్యి. ఎంత స్వేచ్ఛగా, చీకూ చింతా లేకండా వెళ్తున్నాయో చూడు. మనల్ని పసిగట్టి, ఎక్కడికి, ఎట్టా పారిపోవాలా అని గాభరా పడతన్నయ్యి. వాటి ప్రయాణం వాటిని చెయ్యనీ.. పద మనం పోదాం. మల్లా పడవెళ్ళి పోద్ది." వెంకటలక్ష్మి వారించి పైకి లేచింది.

"అంతే నంటావా? బామ్మరిది కిట్టం కదా.. కాసిని అట్టుకెల్దామా అనుకున్నా." వెంకి ఏడుపు ఆపి మామూలుగా అయినందుకు ఆనందంగా వెంబడించాడు.

"ఏందో మావా! అట్టా పొదల్లోకెళ్ళి, ఏదో పాపం చేత్తనట్టుగా.. నాకు నచ్చలేదు. ఎవరైనా చూత్తే ఎంత అసియ్యంగా ఉంటద్ది.. పరువు పోతుంది. చిలవలు పలవలు కల్పించి ఎవురైనా ఏదైనా చెప్పెయ్యచ్చు కూడా. మనకేం కర్మ చెప్పు. దర్జాగా సంసారం చేసుకోకుండా.. భయం భయంగా తప్పు చేస్తన్నట్లు తుప్పల చాటుకి పొయ్యి..." వెంకటలక్ష్మి గొంతులో ఏదో అడ్డుపడ్డట్టయి మాట్లాడ లేకపోయింది.

"సరే.. దానికంత సీనెందుకట.. మావూలుగ చెప్తే పొయ్యేది కద!" నిష్ఠూరం వేశాడు నారాయడు. రెండు సంచీలు ఒక చేతిలోకి మార్చి, వెంకి చెయ్యి పట్టుకున్నాడు.

"అది కాదు మావా! నీ ఆవేశం చూస్తే నాకు భయం వేసింది. ఏం చెయ్యాలో తోచలేదు. పైగా.. నా మీద నాకే నమ్మకం పోయింది. ఎట్టాగో అడ్డుకోకపోకుంటే అల్లరై పోతావని. ఇప్పుడైతే ఎవ్వరూ లేరు. కానీ పరుగెత్తుకునో.. సైకిల్ మీదో ఎవ్వరైనా వత్తే.. ఏం చెయ్యగలం చెప్పు.. అందుకే.." తల కొద్దిగా దించుకుని తడబడుతూ అంది వెంకి.

"సరే.. ఇంకనెప్పుడూ ఇట్టాంటి కక్కుర్తి పడద్దులే వెంకీ! మనం నిగ్రయించు కుందాం. ఇంక నవ్వుతూ నడు.. పడవలు ఇయ్యాల తక్కవుంటయ్యి.." అన్నాడే కానీ, వెంకి మీదికే మాటి మాటికీ పోయే మనసుని ఎట్టా నిగ్రహించుకోవాలో బోధ పడలేదు.

ఆ.. ఏవుందీ.. పని మీదికి మళ్ళించుకుంటే సరి.. అడుగులు హుషారుగా పడ్డాయి నారాయడికి.

"అదిగో.. పడవ బయల్దేరబోతాంది. ఆగరా కుంటోడా.. వచ్చేత్తన్నాం." పరుగు పరుగున వెళ్ళి పడవెక్కారు. పడవెక్కాక గుర్తుకొచ్చి.. భయంగా వెంకటలక్ష్మిని చూశాడు నారాయడు.

"ఏం శీనన్నా! బాగున్నావా? బేరాలు బాగొత్తన్నయ్యా?" పడవ శీనయ్యని నవ్వుతూ పలకరించింది వెంకి.

శీనయ్య కుటుంబంలో అన్నదమ్ములిద్దరూ తాత ముత్తాతల తరం నుంచీ పడవలు నడుపుతూనే జీవనం సాగిస్తున్నారు. శీనయ్య పుట్టినప్పుడు బాగానే ఉన్నాడు. ఏడాది తరువాతా పోలియో మహమ్మారి బారిన పడ్డాడు.. పడకపోనేమో.. వాడి నాన్నమ్మ ఇంజక్షన్లిచ్చే ఆస్పత్రి వాళ్ళొస్తే.. పిల్లాడికి సూది గుచ్చుతారా అని చంకనేసుకుని తోపుల్లోకి పారిపోయింది. దాని ఫలితం.. శీనయ్యకి కొన్ని రోజులు జ్వరం వచ్చి, కాలు వంకర పోవడం.

ఎన్ని తైలాలు మర్ధనా చేసినా ఉపయోగం సున్నా. కొంత సుగుణం ఏమిటంటే.. ఆ వ్యాధి ప్రభావం ఒక కాలి మీదే ఉండడం. తొందరగా మేలుకుని నాటు వైద్యం అయినా వెంటనే చేయించడం వల్ల, మోకాలు కింద భాగం సన్నగా బలం లేకుండా పోయినా.. కాలు ఎత్తెత్తి నడవ గలుగుతున్నాడు.

ఊర్లో అందరూ కుంటి శీనయ్యా అనే పిలుస్తారు. అది వాడిక్కూడా అలవాటై పోయి.. కల్మషం లేని నవ్వుతో సమాధానం ఇస్తాడు. పొద్దున్న ఎనిమిగంటలకి పడవెక్కితే ఒంటిగంటకి కూడు తినడానికే ఆపడం. ఉండటానికి మూడు పడవలు ఉన్నా.. ఒక రోజొస్తే రెండ్రోజులు ఎగ్గొట్టే వాళ్ళే. అందుకే శీనయ్య పడవే పడవ అనుకుంటారు ఊర్లో.

అందరూ కుంటోడా అని పిలిచినా, వెంకటలక్ష్మి మాత్రం 'శీనన్నా' అనే పిలుస్తుంది. ఒక మనిషిలోని అంగలోపాన్ని ఇంటి పేరుగా మార్చడం అమానుషంగా అనిపిస్తుంది తనకి. అందులో అతని తప్పేమైనా ఉందా అని వాదిస్తుంది నారాయడితో.

"అట్టా పిలిచావంటే.. రెండ్రోజులు మాట్లాడ్నంతే.." నారాయడ్ని బెదిరిస్తుంది. లెంపలేసుకుని క్షమాపణ చెప్పే వరకు వదలదు.

అలవాటు చొప్పున కుంటోడా అని పిలిచిన నారాయడు, బెదురుతూ వెంకటలక్ష్మి చూశాడు. అదృష్టం.. వెంకి, శీనయ్య కుటుంబ యోగక్షేమాలు విచారించడంలో పట్టించుకోలేదు. లేకపోతే.. అసలే ఆ పొదల్లో జరిగిన గోలతోనే సతమతవైపుంటే ఇదొకటి దానిగ్గాని కలిసిందంటే గోవిందా.. గోవింద.. అయ్యప్ప మాలేసుకోవాల్సిందే!

మోటారు ఆన్ చేసి, పడవని పోనిస్తున్న శీనుతో మాటలేసుకుంది వెంకటలక్ష్మి. కళ్ళు విప్పార్చి, శీనుగాడు చెపుతున్న ప్రతీ కబురూ

ఆసక్తితో వింటున్న వెంకటలక్ష్మి అమాయకంగా.. పసిపిల్లలా కనిపించింది.

అట్లా ఆ కళ్ళు తిప్పడాన్ని, మెరుస్తూ.. అటూ ఇటూ చేపపిల్లల్లా కదులుతున్న ఆ కనుపాపల్ని, మొహంలో చూపిస్తున్న ఆప్యాయతని.. వెనుక బెంచి మీద కూర్చుని గమనిస్తూ ఉండిపోయాడు నారాయుడు.

అప్పుడే పూసిన మల్లెపువ్వంత స్వచ్ఛమైన నవ్వుతో వెలిగిపోతున్న వెంకటలక్ష్మిని చూస్తుంటే  తేనెలాంటి తియ్యని ప్రేమ తో మనసంతా నిండి పోయింది. ఎటువంటి ఉద్రేకమూ కలగలేదు. మనసంతా నిర్మలంగా ఉంది.

విశ్వమంతా నిండిన ప్రేమ! పిల్ల తెమ్మెరలకు తలలూగించే చెట్ల కొమ్మల్లో, సుప్రభాత స్వరాలు వినిపించే కోయిలమ్మ పాటలో, సేదతీర్చే పరిమళాలను వెదజల్లే పారిజాతాలలో, పొగడ పూలలో.. అమ్మ పాల కోసం పరుగెత్తే లేగదూడ విన్యాసంలో.. ప్రకృతి అంతా వ్యాపించిన ప్రేమ.. నారాయుడి ఒడలంతా పులకరించింది.

పక్కకి వంగి, గలగలా పారుతున్న క్రిష్ణమ్మ అలల్లో చెయ్యి పెట్టాడు. సాగర సంగమానికై పరుగులిడుతున్న కృష్ణమ్మ.. ఆ వడి, ఆత్రం.. చెయ్యి జిల్లుమంది. గభాల్న పైకి తీసి, నీళ్ళని విదిలించాడు.

మీద పడుతున్న చిరుజల్లుకి వెంకటలక్ష్మి భ్రుకుటి ముడిచి చూసింది. మళ్ళీ మొదలెట్టాడా..

ఆర్తిగా చూస్తున్న నారాయుడిని చూస్తూనే గుండె ఒక సారి ఆగి కొట్టుకుంది. ఎటువంటి అలజడీ లేని.. పసిపిల్లడిలా చూస్తున్నాడు నారాయుడు. తెల్లని అతని లాల్చీ, పైజామా అప్పుడే విచ్చుకుంటున్న మబ్బుల్లోని సూర్యుని వెలుగులో స్వచ్ఛంగా మెరుస్తున్నాయి. అతని శ్యామ వర్ణపు శరీరం.. మరింత నల్లగా నిగనిగ లాడుతూ ఉంది.

వెంకట లక్ష్మికి కూడా పెనిమిటిని ఆ స్థితిలో చూడగానే ఉద్వేగావేశాలకి అతీతమైన ప్రేమ కలిగింది. ధ్యాన ముద్రలో ఉన్న సర్వేశ్వరుని ఆదిశక్తి కాంచించే పవిత్రమైన ఆరాధనా వీక్షణం.

రెండు నెలలుగా ఇల్లు కట్టడంలో.. వెంకటలక్ష్మిని చూసుకోవడంలో అలసి సొలసిన నారాయుడి శరీరానికి కొత్త శక్తి వచ్చినట్లయింది. దంపతులిద్దరు అనురాగంతో ఒకరి నొకరు చూసుకున్నారు.

ఆరోజు మార్కెట్ కి సెలవు. అందుకేనేమో.. పడవలో శీనయ్య, వెంకీ, నారాయుడు తప్ప ఇంకెవరూ లేరు. శీనయ్య, స్టీరింగు తిప్పుతూ ముందుకి చూస్తున్నాడు.

“శీనూ! ఇయ్యేల ఏం బేరాలున్నట్టు లేవే.. పొద్దుగుంకే వరకూ ఉంటావా మరి? మేం రాత్రికి ఇంటికెల్లి పోదామనుకుంటన్నాం.” నారాయుడు దృష్టి మళ్ళించుకుని అన్నాడు.

“ఉండకపోవచ్చన్నా! రేపు పొద్దు పొడిచే టయానికి తప్పక వచ్చేత్తా. రేత్రికి మావగారింట్లో ఉండి పోవచ్చు కదా?” సలహా ఇచ్చాడు సీనయ్య.

“నువ్వుండనంటే మరంతే చెయ్యాలి. కొంచెం ఒడ్డుకి దగ్గరగా తీస్కెల్లు. మీ వదినకి నడుం నొప్పి చేసింది. జాగ్రత్తగా దించాలి.”

“అట్టగే.. నే కూడా చెయ్యందిస్తాలే!” ఒడ్డు చేరగానే లంగరు వేసి.. ఒడ్డుకి బల్ల దించాడు సీనయ్య.

నారాయుడు, సంచీలు ముందు దించేసి వచ్చి, వెంకటలక్ష్మికి చెయ్యందించి జాగ్రత్తగా ఒడ్డు మీదికి తీసుకెళ్ళాడు

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments